# రాచపట్టు

తెలుఁగు దేశమునఁ జలువ వంశమునకును, గలువ వంశమునకును విలువ కలదు. ఈ రెండు వంగడములవారును దరతరములనుండియు వియ్యమువారు. పరాక్రమమునను బరిభవమునను సరివారు.

మొగలాయి యేలుఁబడిలో కోడిపందెములతో పాటు గుఱ్ఱపుఁ బందెములకును మోజు హెచ్చెను. ఏలికల యొరవడివలనఁ 'గలువ రామారాయణింవారును జలువ వెంగళ రాయణింవారును గుఱ్ఱపుఁ బందెమునకు దిగిరి. వెంగళరాయణింవారు వెనుకఁ బడిరి. 'చలువమడతలవారికిఁ గోడిపందెములు గాని గుఱ్ఱపుఁబందెములేటి కని కలువ రామారాయణింవారు గేలిచేసిరి. 'కలువవారు పలువవారని వెంగళరావుగారు వెక్కిరించిరి.

బాపనవారికిఁ బరిహాస మిష్టదేవత, రాచవారికో రణదేవత. రామారాయణింవారు కత్తిదూసిరి.వెంగళరాయణింవారు ప్రేటే వేసిరి. విడఁదీయుటకు నడుమలకు వెళ్ళిన కొందఱు బంటులు వారి కత్తులకు బలియైరి. ఈ వార్త నగరికిఁ జేరెను. నగరమంతయు నచటికిఁ జేరెను. వియ్యమువారును నెయ్యమువారును వచ్చులోపుగా వారిరువురును రణభూమికి బలియై పోయిరి. నాఁటినుండి నేఁటివఱకును ఆ రెండు వంగడముల నడుమఁ బచ్చిగడ్డి పడుచో బగబగ మండిపోవును.

## 2

కొన్ని తరములు కడచెను. తరములు కడచినకొలఁది చలుపకారము పెరిగెను. మరల వియ్య మందుటయే దీనికి మందని ఉభయవంశములవారును గ్రహించుకొనిరి. అంతటం గలువ వెంకయ్యమ్మారావుగారికిని జలువ పాపారావుగారికిని బెండ్లి యాలోచనలు జరిగెను.

వివాహ మొక నదీసంగమము. ఆ తీర్థమున నుభయవంశములును శాంతిరసము గ్రోలును. వెంకయ్యమ్మారావుగారి కిరువది దాఁటెను. సాముచే దృఢమయిన యామె శరీర మినుము; నూనె రాచిన మినుము.

పెండ్లి మంతనమునకుఁ దలిదండ్రులే యధిదైవతములు గావునఁ గలువవారు చంద్రికయను నొకదాసిని జలువవారి దివాణమున కంపిరి. చలువవారును

చంద్రముఖియను నొక దాసిని కలువవారి దివాణమున కంపిరి.

ఈ దాసిక లిరువురును ఈ రెండు దివాణములయందును గుత్తుకబంటిగా భుజించిరి. క్రొత్తచీరలు కట్టుకొనిరి.

అక్కడ పాపారావుగారు చంద్రిక నేకాంతమునకుఁ బిలిపించుకొని రేయి చాలఁ బ్రొద్దు పోవువఱకు మాటాడిరి.

ఇక్కడ చంద్రముఖి వెంకయ్యమ్మరావుగారి యేకాంత భాషణమునకుఁగాని ఆమె రూపమునకుఁగాని అంత సుముఖికాలేదు. కాని సుముహూర్తము నిశ్చితమాయెను.

## 3

ధర్మారావుగా రల్లున కొకయేనుఁగును రెండు లొట్టియలును నాలుగు గుఱ్ఱములును ఎనిమిది యూళ్లను పదునాఱుగురు దాసికలను సూఱాపులను కట్నమిచ్చు కోరికను వెలిబుచ్చిరి.

మునిముందు జయభేరియు పిదప ముఖవీణయు వెనుక సనాయియు తరువాత నేనుఁగులును గుర్రములును ఒంటెలును బంటులును వారాంగనలును కూడిరా పట్టపేనుఁ గెక్కి పాపారావుగారు పాణిగ్రహణమునకు బయలుదేఱిరి.

పెండ్లికొడుకు యుద్ధముచేయని వీరుఁడు. రాజ్యము లేని రాజు. అతఁడూ రేఁగి దిగ్విజయము చేయును. అతనిమాట అపుడు శాసనము. అతఁడు విశ్రమించెనా వీఁపోపులు, పలుకరించెనా బహుమానము.

పాపారావుగారసలే రాజుగారు, మఱి యిపుడు పెండ్లికొడుకు.

వివాహమంటపము లతావృక్షములచే నందనమువలెఁ బూలచేఁ జైత్రరథమువలె నుండెను. పాపారావుగారు పటాకత్తి వ్రేలాడుచుండఁగా వివాహ మంటపమునఁ బ్రవేశించిరి. లగ్న మాసన్నమాయెను. వివాహమంటపమున పటమంటపము బూరటిల్లి వధూప్రవేశ మెదురుఁగించెను.

వియ్యంకులును వారి బంటులును ఎదురు బొదురుగా నిలుచుండిరి.

## 4

పురోహితుని తొందరవలన పాపారావుగారు పటగృహమునకు అఱ్ఱుసాఁచిరి. అందు వెంకయ్యమ్మారావుగారు కూర్చుండిరి. ఆమె కీవల చంద్రిక నిలిచియుండెను.

పాపారావుగారు వధువును జూచి తల పైకెత్తి చంద్రికను జూచువారు చంద్రికను జూచుచునే యుండిరి.

చంద్రిక తల వంచుకొనెను. వెంకయ్యమ్మారావుగారు తల యెత్తిరి.

మంత్ర మాయెను, తంత్రముకానిండని పురోహితుఁడు ముదలకించెను.

తాళిబొట్టు కట్టించుటకుఁ జంద్రిక క్రిందికి వంగెను. సూదంటురాయి లోహము నాకర్షించెను.

'పెండ్లిపీటమీఁదఁ గూరుచుండఁదగిన దిది; పెండ్లికూఁతు ప్రక్క నిలువఁబడఁ దగిన దది' అని తలఁచుచున్న పాపారావుగారి మానసమునఁ పురాణవైరము పురాణించెను.

పురోహితుఁడు తొందరించెను. మంగళసూత్రము బంధింపఁజేయుటకుఁ జంద్రిక పాపారావుగారి చేతులను మృదువుగా స్పృశించెను. ఆ స్పర్శ వారికి ముక్తాహారములు కల్పించెను. వివాహ సభలో నవ్వులును గుసగుసలును బయలు దేఱెను. పురోహితుఁ డింకొక తూరి హెచ్చరించెను. వెంకయ్యమ్మారావుగారి మనసు విఱిగెను.

అంతలో పాపారావుగారి చేతిలోని మంగళసూత్రము చంద్రికకు గ్రైవేయ మాయెను. చంద్రికచూపు లతనికిఁ దలఁబ్రాలాయెను.

వెంకయ్యమ్మారావుగారు రుద్రయ్యమ్మారావుగారై రుసరుసలాడుచు రాణివాసము లోనికిఁ బరుగిడిపోయిరి. వివాహసభ దక్షయజ్ఞ మాయెను.

## 5

ఇదేమి దుస్సాహసమ'ని తల్లి గద్దించెను.

'అతఁడు దానికే తగినవాఁడు. నా కనుల యెదుట నతఁడు చంద్రిక మెడలో పుస్తెకట్టెను. ఇది చలపాదుచుటకాక మఱేమి! కొబ్బరికాయ తలయు కుందబొజ్జయుఁ గల యీమన్మథుఁడు మఱి నాకు దొరకఁడా?...

'అది యేమే, అది యేమే' యని తల్లినోరు మూసికొనెను.

'కలువవారి రక్తము నా శరీరమున నిసుకలేదు, చలువవారికి రణరంగమున మెఱవడి చేయుటచే పరాక్రమమునకు పాడి. ఈతులువ నా యెదటనే నా దాసికిఁ దాళి కట్టుచుండఁగఁ జూచిచూచి నీ యానతి చొప్పున నోరుమూసికొని దైవముఖమును దేవిరింపఁబోవను' అని వెంకయ్యమ్మారావుగా రనుచుండఁగా తండ్రి యటకు విజయం చేసెను. వెంకయ్యమ్మారావు గారు తలిదండ్రులకుఁ బ్రదక్షిణముచేసి 'వైరమునకు నన్ను లంచ మిచ్చితిరి. అతఁడు బలియిచ్చెను. ఈ మీ పొరపాటును కత్తిగాని మఱి యొకటి సవరింపఁజాలదు. ధర్మమును కాపాడఁదలఁచుకొందురేని వెంటనే కత్తి గైకొనుఁడు. ఇఁక నిసుమంతయు నవకాశము లేదు' అని కత్తుల బావి కదకుఱికెను.

## 6

'వెనుకటి కసి తీర్చుకొనుటకే పెండ్లి పెట్టుకొని ర'ని బంధుగులనుకొనిరి. 'పెండ్లి కూఁతురు పీటవిడిచి మమ్మవమానించె'నని చలువవారనిరి. దాసికిఁ బుస్తెకట్టిన వారిపైఁ గత్తికట్టితి' మని కలువవారనిరి.

వివాహ రంగము చూచుచుండఁగాఁ జూచుచుండఁగా రణరంగముగా మాఱెను.

కర్మ మేతము. దాని కొమ్మొకతూరి మన్ను మొట్టును. మఱియొకతూరి మిన్ను ముట్టును.

'వధువును బట్టుకొనుఁడు వధువును బట్టుకొనుఁడ'ను కేకలు వినఁబడెను. 'వరుని బట్టుకొనుఁడు వరుని బట్టుకొనుఁడ'ను కేకలు చెవి చఱచెను.

పాపారావుగారు చంద్రికను గట్టిగాఁ బట్టుకొనిరి. చంద్రిక పాపారావుగారిని గట్టిగాఁ బట్టుకొనెను.

'పట్టుకొనుఁడు పట్టుకొనుఁడు.'

ఈ కేకలే యుద్ధమనకు దుఱ్ఱుచ్చి, ఇరువాఁగులవారును చేతులు కలుపుకొనిరి. బంటులును బంటులును దాసికలును దాసికలును బంధుగులును బంధుగులును వియ్యపురాలును వియ్యపురాలును వియ్యంకుఁడును వియ్యంకుఁడును ధర్మయుద్ధ మొనరించి వీర స్వర్గ మలంకరించిరి.

పాపారావుగారు రాణివాసము చొరఁబాఱుచుండఁగా వెంకయ్యమ్మారావుగారి అసిపుత్రిక అతనిమీఁదఁ బడఁబోయెను. అంతలో చంద్రిక అడ్డము వచ్చెను. ఆ కత్తి నామె క్రిందం బాఱపయిచెను. అది నేలఁబడి రెండుగా తునిసెను.

●